# 'రాజర్షి!'

బాయ్!... బాయ్... విస్కీ తీసుకరా...... సోడాకూడా బాయ్!

విస్కీ... సేఠ్ లక్ష్మీదాస్‌జీ! నేనిప్పుడు రాజాసాబ్‌ను కాను. బికారీని... నన్ను దోచుకున్నారు. నేను నాశనమయిపోయాను. సేట్‌జీ! నాశనమయిపోయాను... బాయ్! విస్కీ... సోడా... సేఠ్ లక్ష్మీదాస్‌జీ! నేను విస్కీ తాగకుండా వుండలేను. సోడాలేకండా విస్కీ తాగలేకపోతున్నాను. సేఠ్ లక్ష్మీదాస్‌జీ! వృద్ధాప్యం వచ్చేసింది. అమాంతంగా వచ్చేసింది... నిరుటివరకూ నేను సోడాలేకండా విస్కీ తాగేవాణ్ణి: కాని ఇప్పుడు...? నిరుడు నేను రాజాసాబ్‌ను! జాగీరుండేది, ఎస్టేటువుండేది, జమీన్ వుండేది... కాని ఇప్పుడు అంతాపోయింది. అంతా దోచుకున్నారు. నాశనం చేశారు... ముష్టిమూడురాళ్ల నష్టపరిహారమంటూ నా మొహాన కొడ్తున్నారు.... బికారీనై పోయాను. సేఠ్‌జీ! బికారీని! బాయ్! విస్కీ... ఆఁ తెచ్చావా... రైట్... సోడాఏదీ!... రైట్. నువ్వేకలుపుభాయ్...

నువ్వూ ఓ కుర్చీ లాక్కొని కూచో... నువ్వూ ఓ గ్లాసుతీసుకో... అట్లా చూడకు భాయ్! నువ్వూనేనూ ఒకటే. భేదంలేదు... నీకు తెలియదూ! నీకింకా తెలీదూ! నేనిప్పుడు 'రాజాసాహెబ్'ను కాను. బికారీని... ఉత్త బికారీని!... మనంమనం భాయీలం. సోదరులం... రా ఇలాకూచో... సేఠ్ లక్ష్మీదాస్‌జీ! మీరే చెప్పండి. వీడు నమ్మకండా వున్నాడు... చెప్పండి. నేను... నేను నాశనమయిపోయానని చెప్పండి. నన్ను దోచు కున్నారు... మన ఈ గవర్నమెంటువారే దోచుకున్నారని చెప్పండి... సేఠ్ లక్ష్మీదాస్‌జీ! నాకేడుపొస్తోంది. నా దుర్గతిచూసి నాకే ఏడుపొస్తోంది ...మీరు యాడవరూ! మీకు జాలిలేదూ?... ఇదిగో ఈ పెగ్ తీసికోండి. యాడవండి. నాకోసం ఈ బికారీ రాజాకోసం యాడవరూ? బాయ్! ఇదిగో ఈ పెగ్ నువు తీసుకో... నువ్వూ యాడవ్... యాడవ్వూ... నామీద దయదలచండి సేఠ్ లక్ష్మీదాస్‌జీ! మీదాసుణ్ణవుతాను, నాకు దారి ఏదైనా చూపించండి... నా దగ్గిర అట్టేమిగల్లేదు. నేను బికారిని!... మీ మిల్లు షేర్లు ఇప్పించండి. ఒకలక్ష, రెండు లక్షలు... అంతే. అంత కంటే ఎక్కువ నేను పెట్టలేను. నేను బికారీని!... సేఠ్ లక్ష్మీదాస్‌జీ: నా ముందుగతేం కాను?... చెప్పండి, సేఠ్‌జీ! నేనేం చెయ్యాలో చెప్పండి... నన్ను పిల్చి పిండితే ఓ అయిదు లక్షలకంటే ఎక్కువ చెయ్యను. మా బికారి రాణీవారి దగ్గిర మరో ఐదు లక్షల జవ్వారీ వుంటుంది. చూడండి సేఠ్‌జీ! నేనెంత అధోగతిపాలైనానో చూడండి చూడండి. నేనేమిటి, ముష్టి పదిలక్షలేమిటి!... కాని నాఖర్మ అంతే వుంది. ఏం చెయ్యను... చెప్పండి సేఠ్ లక్ష్మీదాస్‌జీ! ఏంచెయ్యాలో చెప్పండి... ఫిలిం కంపెనీ పెట్టనా? ఇలాంటి హోటల్ పెట్టినా?... ఓ మిల్లు తెరవనా?... మరో గుర్రం కొననా?... చెప్పండి సేఠ్‌లక్ష్మీ

దాస్‌జీ! నేను మీ దాసుణ్ణి. చెప్పండి నా కొడుకుల విషయమా?... అడక్కండి కడుపు తరుక్కు పోతోంది... కాళ్ళా వేళ్ళా పడితే పెద్దవాడికి కలెక్టరీ ఇచ్చారు. చిన్నవాణ్ణి క్యాప్టెన్ చేశారు... కాస్త ఆలోచించండి సేఠ్ లక్ష్మీదాస్‌జీ! ఆ ధర్మరాజ్యం రోజుల్లో నా దర్శనార్థమై అనేకమంది కలెక్టర్లు నా కోటీముందు పడిగాపులు కాచేవారు. ఎంతోమంది క్యాప్టెన్లు నా బాడీగార్డ్సుగా నా వెనకాల తిరిగేవారు! ఇప్పుడు అవే ఉద్యోగాల కోసం నా కొడుకులే దేవుళ్ళాడు కోవలసిన గతి పట్టింది! ఇంతకంటే అన్యాయం వుంటుందా సేఠ్ లక్ష్మీదాస్‌జీ!... కాని మీకింకా నామీద జాలి కలిగినట్లు లేదు. మీరు యాడవటం లేదు... బాయ్! విస్కీ... సోడా... సేఠ్ లక్ష్మీదాస్‌జీ! యాడవండి, నాకోసం యాడవండి... నాకూ ఏడుపొస్తోంది. నా దుస్థితి చూచి నాకే ఏడుపొస్తోంది... మీరు యాడవండి... యాడవరూ?...